

## నరసింహస్వామి హుండీ ఆదాయం

కర్లపాలెం: అల్లూరులోని రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయం హుండీ ఆదాయంరూ.2,17,253 వచ్చినట్లు ఈవో శ్రీనివాసవర్మ బుధవారం తెలిపారు.



## కురిసింది వాన

తాడికొండ: దాదాపు నెలకుపైగా ముఖం చాటేసిన వరుణ దేవుడు ఎట్టకేలకు కరుణించాడు. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం అందరికీ ఊరటనిచ్చింది.



## దుర్గమ్మ హుండీ ఆదాయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు హుండీల ద్వారా రూ.4,37,16,236 నగదు, 395 గ్రాముల బంగారం, 9.614 కిలోల వెండి సమకూరాయని ఈఓ శీనానాయక్ తెలిపారు.

# ఆశ పడ్డారు...భంగ పడ్డారు

- చీరాల మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో ఎమ్మెల్యే మార్క్
- పదవి ఆశించి భంగపడ్డ నేతలు
- ఆస్తులు అమ్ముకొని నష్టపోయానంటూ కౌన్సిలర్ సుబ్బయ్య ఆవేదన
- ఆవేదనతో పచ్చపార్టీకి రాజీనామా
- వైఎస్సార్ సీపీని వీడి భంగపడ్డ మాజీ చైర్మన్ జంజనం
- కౌన్సిలర్ రాములుకు మొండిచెయ్యి
- వైఎస్సార్ సీపీ నుంచి వచ్చిన నేతలకు వెన్నుపోటు
- ఎమ్మెల్యే కొండయ్య తీరుపై మెజార్టీ సామాజికవర్గాల ఆగ్రహం

**ఎమ్మెల్యే సామాజిక వర్గానికే చైర్మన్ గిరి**



మించాలకు అనుకూలంగా చేతులు పైకి ఎత్తి మద్దతు తెలియజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కౌన్సిలర్లు

**సాక్షి ప్రతినిధి, బాపట్ల:** వంచనకు, వెన్నుపోటుకు మారు పేరు తెలుగుదేశం పార్టీ. ఆ పార్టీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబును సైతం విమర్శకులు, రాజకీయ విశ్లేషకులు చాలామంది అదే పేరుతో సంబోధించడం తెలిసిందే! అలాంటి పార్టీని, అధినేతను నమ్మి చేరితే వెన్నుపోట్లు, భంగపాట్లు తప్ప ఏం జరుగుతుంది? ఇప్పుడు చీరాల మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో అక్షరాలా ఇదే జరిగింది. ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య తన సామాజికవర్గానికే చెందిన 11వ వార్డు కౌన్సిలర్ మించాల సాంబశివరావుకే చీరాల మున్సిపల్ చైర్మన్ పదవి కట్టబెట్టారు. పదవిని ఆశించిన వివిధ సామాజికవర్గాల సీనియర్ నేతలకు భంగపాటు తప్పలేదు. దీంతో ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. మరోవైపు అధికారం, పదవులను ఆశించి కన్నతల్లి లాంటి వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచిన సీనియర్ కౌన్సిలర్లు చంద్రబాబు పార్టీలో అదే వెన్నుపోటుకు గురికావడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

### మించాలను వరించిన చైర్మన్ పదవి

బుధవారం జరిగిన చీరాల మున్సిపల్ ఎన్నికల్లో 19వ వార్డు కౌన్సిలర్ మించాల సాంబశివరావును చైర్మన్ గా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే సామాజిక వర్గానికి చెందిన మించాలను పార్టీ అధిష్టానమే షీల్డ్ కవర్ పద్ధతిలో ఎంపిక చేసినట్లు పచ్చ పార్టీ నేతలు కలరింగ్ ఇచ్చినా కవర్ తెచ్చినట్లు చెబుతున్నా కవర్ తెచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి సైతం అదే సామాజికవర్గానికి చెందిన వారు కావడం చీరాలలో మరింత చర్చనీయాంశంగా మారింది. మొత్తానికి ఎమ్మెల్యే కొండయ్య తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినే మున్సిపల్ చైర్మన్‌గా ఎంపిక చేయడం పట్ల నియోజకవర్గంలోని మిగిలిన బలమైన సామాజిక వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. బలమైన పద్మశాలి సామాజికవర్గానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుతోపాటు ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన 18వ వార్డు కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య, కాపు సామాజికవర్గానికి చెందిన 9వ వార్డు కౌన్సిలర్ రాములు సైతం మున్సిపల్ చైర్మన్ పదవి కోసం పోటీపడ్డారు.

### ఫిరాయింపుదారులకు పచ్చపోటు

చీరాల మున్సిపాలిటీలో 33 కౌన్సిల్ స్థానాలు ఉండగా వైఎస్సార్ సీపీ తరపున 22 మంది, మాజీ మ్మెల్యే ఆమంచి మద్దతుదారులు 11 మంది కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. టీడీపీ అధికారంలోకి రావడంతో 26 మంది అనైతికంగా వెన్నుపోటుతో పచ్చ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పుడు అదే నేతలకు చంద్రబాబు వెన్నుపోటు కలిసొచ్చింది. పార్టీలో చేర్పించుకొని పచ్చ పార్టీ కసితీరా వెన్నుపోట్లు పొడిచింది. వైఎస్సార్ సీపీని వీడివెళ్లిన వారికి ఇలాగే జరగాలని చీరాల వాసులు భావిస్తున్నారు.

మూడుసార్లు కౌన్సిలర్‌గా గెలిచి చైర్మన్ పదవి దక్కకపోవడంతో 18వ వార్డు కౌన్సిలర్ పొత్తూరు సుబ్బయ్య పత్రికలు, మీడియా ముందుకు వచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. తనను పచ్చపార్టీ చంపేసిందన్నారు. పార్టీ కోసం ఆస్తులు అమ్ముకొని నష్టపోయానని తీవ్ర ఆవేదన చెందారు.

### కన్నీటి పర్యంతమైన సుబ్బయ్య



టీడీపీకి, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నానన్నారు. పాపం పొత్తూరు సుబ్బయ్య ఆవేదన చీరాల వాసులను కదిలించలేకపోయింది. పదవుల కోసం తన రాజకీయ ఎదుగుదలకు కారణమైన వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచి ఆయన పచ్చపార్టీ కండువా కప్పుకోవడాన్ని చీరాల వాసులు ఇంకా మరిచి పోలేదు. అందుకే ఆయన కన్నీళ్ల పట్ల ఇక్కడి ప్రజలలో సానుభూతి కనిపించలేదు. మొత్తంగా చీరాల కొత్త మున్సిపల్ ఎన్నిక ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్యపై మెజార్టీ సామాజికవర్గాల్లో వ్యతిరేకత పెంచగా పచ్చపార్టీ వెన్నుపోట్ల వ్యవహారం మరో మారు చర్చనీయాంశంగా మారింది.

### నేడు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

**చీరాల:** చీరాల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక బుధవారం జరుగుతుందని ఊహించినా చివరి నిమిషంలో వాయిదా పడింది. గురువారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి టి.చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు.

### అనైతిక వెన్నుపోట్లు

చీరాల మున్సిపల్ చైర్మన్ విషయంలో టీడీపీ అవిశ్వాసం నోటీసు ఇవ్వగానే వైఎస్సార్ సీపీ తరపున గెలిచి చీరాల మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న జంజనం శ్రీనివాసరావు అప్రమత్తమై పదవితోపాటు రియల్ ఎస్టేట్ అక్రమ వ్యాపారాలను నిలబెట్టుకోవాలనే తాపత్రయంతో పచ్చపార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్ సీపీ నుంచి కౌన్సిలర్‌గా గెలిచిన పొత్తూరు సుబ్బయ్య మున్సిపల్ చైర్మన్ కావాలనే తాపత్రయంతో సొంత పార్టీ వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచి ఏకంగా చంద్రబాబు సమక్షంలో పచ్చపార్టీలో చేరారు. ఇక తాజాగా చైర్మన్‌గా ఎన్నికైన సాంబశివరావు సైతం వైఎస్సార్ సీపీ నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికై ఎమ్మెల్యే సమక్షంలో పచ్చపార్టీ కండువా కప్పుకున్నారు. మరో కౌన్సిలర్ రాములు వైఎస్సార్ సీపీ తరపున ఎన్నికై మున్సిపల్ చైర్మన్ గిరీ ఆశించి టీడీపీలో చేరారు. వీరందరూ చంద్రబాబు వెన్నుపోటును ఆదర్శంగా తీసుకొని వెన్నుపోట్లకు దిగిన వారే కావడం గమనార్హం.

## మెరుగైన వైద్య సేవలందించాలి

- వైద్యులు సమయపాలన పాటించాలి
- జిల్లా వైద్యశాలల సమన్వయ అధికారి మోజెస్‌కుమార్



డాక్టర్లతో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాలల సమన్వయాధికారి ఎన్. మోజెస్‌కుమార్

**పిట్టలవానిపాలెం(కర్లపాలెం):** సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా ప్రభుత్వ వైద్యశాలల సమన్వయ అధికారి డాక్టర్ ఎస్.మోజెస్‌కుమార్ వైద్యులకు సూచించారు. పిట్టలవానిపాలెం లోని వైద్య పరిషత్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా ప్రభుత్వ వైద్యశాలల సమన్వయ అధికారి డాక్టర్ ఎస్.మోజెస్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది అందరూ నిర్దేశిత సమయానికే వైద్యశాలకు చేరుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలతోపాటు ముఖ్యంగా టాయిలెట్‌లను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని రకాల వ్యాధుల కు అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి సకాలంలో రిపోర్టులు వచ్చేలా వైద్యులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

## 558.70 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం

**విజయపురిసౌత్:** నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం 558.70 అడుగులకు చేరింది. ఇది 229.3671 టీఎంసీలకు సమానం.సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,650 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 65,900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

## న్యూస్‌రీల్

### రాజీమార్గమే రాజ మార్గం

**సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల**



**రేపల్లె:** రాజీ మార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్నివర్గాల కేసుల పరిష్కారం కోసం, దేశం కోసం మధ్యవర్తిత్వం అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేలా బుధవారం స్థానిక తాలూకా కార్యాలయం నుంచి నిర్వహించిన వన్ కే వాక్‌లో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారం కోసం న్యాయశాఖ ప్రతి నెలా మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తుందన్నారు. ఇరు వర్గాలకు న్యాయం చేసి కేసులను త్వరగా పరిష్కరించడమే లక్ష్యంగా న్యాయశాఖ పనిచేస్తుందన్నారు. లోక్ అదాలత్ లతో కేసులు త్వరగా పరిష్కారం అవటంతో పాటు కక్షిదారులకు సత్వర న్యాయం చేకూరుతుందన్నారు. తాలూకా సెంటర్ నుంచి ఓల్డ్ టౌన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గీతాభార్గవి, న్యాయవాదులు, పోలీసులు, పారామెడికల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



**నరసరావుపేటరూరల్:** అల్లూరివారిపాలెం రోడ్డులోని లింగంగుంట్ల చెక్‌పోస్ట్ సమీపంలోని మానసాదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రీ వాసవి మిత్రమండలి అధ్యక్షులు చేగు వెంకటేశ్వరరావు దంపతులు, నేరేళ్ల విజయలక్ష్మి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

### ఉద్యోగం నుంచి వార్డెన్ తొలగింపు

**కారెంపూడి:** స్థానిక మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ ఇన్‌ఛార్జి వార్డెన్ శౌరీ భాయిని ఉద్యోగ విధుల నుంచి తప్పించినట్లు డీఈఓ ఎల్.చంద్రకళ ఆదేశాలు జారీ చేశారని ఎంఈఓ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డెన్‌పై వచ్చిన అభియోగాలు నిజమని కమిటీ విచారణలో తేలడంతో ఆమెను ఉద్యోగం నుంచి తొలగించినట్లు డీఈఓ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో ఎంతో బాధ్యతగా ఉండాలని ఎలాంటి నిర్లక్ష్యాన్ని, అభ్యంతకర ప్రవర్తనను ఉపేక్షించేది లేదని ఎంఈఓ రవికుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### మైనార్టీ విద్యాసంస్థల్లో నేరుగా ప్రవేశాలు

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడుపుతున్న మైనార్టీ బాల,బాలికల పాఠశాలలతోపాటు ఉర్దూ బాలుర జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లలో విద్యార్థులకు నేరుగా ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ మేరకు కన్వీనర్ ఎం.రజని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పొన్నూరు రోడ్డులోని మైనార్టీ బాలికల పాఠశాల, పాత గుంటూరు నందివెలుగు రోడ్డులోని బాలుర పాఠశాలలో 5,6,7,8వ తరగతులతోపాటు ఉర్దూ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 87126 25038, 87126 25039, 87126 25073 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### 3 వేల కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం



**పొన్నూరు:** పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణంలో బుధవారం మున్సిపల్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాదాపు మూడు వేల కిలోల ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం 21 వార్డులోని ఓ ట్రేడర్స్‌లో విక్రయానికి ఉంచిన ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. యజమానికి రూ.10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

# జాతీయ అవార్డు... చేనేతలకు అంకితం

- జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి
- కలెక్టర్‌ను సన్మానించిన అధికారులు



జిల్లా కలెక్టర్‌ను సన్మానిస్తున్న అధికారులు

**బాపట్ల:** 'ఒక జిల్లా–ఒక ఉత్పత్తి' పేరుతో కుప్పడం పట్టు చీరలకు కేంద్ర ప్రభుత్వం అందజేసిన జాతీయ స్థాయి అవార్డును చేనేతలకు అంకితం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రకటించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రి నుంచి కలెక్టర్ అవార్డును అందుకున్న విషయం విదితమే. జాతీయస్థాయి అవార్డును అందుకుని బాపట్ల వచ్చిన జిల్లా కలెక్టర్ వెంకట మురళిని వివిధ శాఖల జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా బుధవారం కలసి సన్మానించి, అభినందనలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ చీరాల కుప్పడం పట్టు చీరలు ఎప్పటినుంచో ప్రాచుర్యం పొందాయన్నారు. కేంద్ర ప్రభుత్వ అవార్డుతో మరింత వెలుగులోకి వచ్చిందన్నారు. చీరాల కుప్పడం పట్టు చీరలకు ఢిల్లీలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఒక జిల్లా–ఒక ఉత్పత్తి పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జాతీయ స్థాయి అవార్డు, గౌరవం చేనేతలకే చెందుతుందన్నారు. కుప్పడం పట్టు చీరలను ఆన్‌లైన్ వ్యాపార వేదికకు అనుసంధానం చేయాలన్నారు. సూర్యలంక బీచ్, వాడరేవు బీచ్ వద్ద, చీరాల పట్టణం, బాపట్ల పట్టణంలోని ప్రధాన కూడలిలో కుప్పడం పట్టు చీరల ప్రదర్శన, అమ్మకాలు జరపాలన్నారు. పొదుపు సంఘాల ద్వారా సంబంధిత నాలుగు ప్రాంతాలలో దుకాణాలు ఏర్పాటు చేసి, వ్యాపారాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేశమంతా ప్రాచుర్యం పొందిన కుప్పడం పట్టు చీరల ఉత్పత్తి విస్తృతం కావాలని, చేనేత కుటుంబాల్లోని నిరుద్యోగులు ఆసక్తిగా చేనేత వృత్తిలోకి అడుగులు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంచి ధరలు రావాలి, చేనేత వృత్తి లాభదాయకంగా మారాలి, చేనేతలకు మరింత ప్రయోజనం కల్పించడమే ప్రభుత్వ ముఖ్యోద్దేశం అన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, సీపీఓ షాలెంరాజు, డీపీఓ ప్రభాకరరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు పి.గ్లోరియా, రామలక్ష్మి, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### బంగారు కుటుంబాల నీడ్ బేస్డ్ ప్రాథమిక సర్వే చేపట్టాలి

**బాపట్ల:** బంగారు కుటుంబాల నీడ్ బేస్డ్ ప్రాథమిక సర్వే కార్యక్రమం ఈనెల 21వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పీ–4 కార్యక్రమం అమలు తీరుపై జిల్లా, మండల స్థాయి అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వే నిర్వహించే ఉద్యోగులకు ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ ముగియగానే సర్వే ప్రారంభించాలన్నారు. ఆగస్టు 7 నుంచి 10వ తేదీ వరకు బంగారు కుటుంబాల అదనపు చేర్పులకు అవకాశం కల్పిస్తామన్నారు. సమాజంలో అత్యంత వెనుకబడిన బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావాలన్నారు. బంగారు కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి మార్గదర్శులు బాటలు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పీ–4 విధానం రాష్ట్ర కమిటీ సభ్యుడు సంతోష్ మాట్లాడుతూ బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించడం, వనరులను సమకూర్చే ప్రక్రియ వేగంగా చేయాలని చెప్పారు. నీడ్ బేస్డ్ ప్రాథమిక సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సీపీఓ షాలేంరాజు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, నియోజకవర్గం ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి నోటీసులు

**పట్నంబజారు:** ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డికి సత్తెనపల్లి పోలీసులు బుధవారం నోటీసులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రెంటపాళ్ల పర్యటనలో భాగంగా జన సమీకరణ చేశారనే నెపంతో అక్రమ కేసు బనాయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీన విచారణకు హాజరు కావాలంటూ పోలీసులు నోటీసులను విద్యానగర్‌లోని నివాసంలో ఆయన్ను కలిసి అందజేశారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి నోటీసులు తీసుకున్నారు.



# చరిత్రకు చిరునామా బాపట్ల వ్యవసాయ కళాశాల

- నకాసా క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ జాగర్లమూడి చంద్రశేఖర్
- ఘనంగా వ్యవసాయ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న నకాసా క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ చంద్రశేఖర్

**బాపట్ల:** చరిత్రకు చిరునామాగా బాపట్ల వ్యవసాయ కళాశాల నిలిచిపోయిందని నకాసా క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జాగర్లమూడి చంద్రశేఖర్ అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల 80వ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం కళాశాలలో నిర్వహించారు. జాగర్లమూడి మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాలుగా విద్యారంగంలోనూ, వ్యవసాయ రంగంలోనూ విశేష సేవలు అందిస్తున్న బాపట్ల వ్యవసాయ కళాశాల ఆదర్శనీయమైన పాత్రను నిర్వహిస్తుందన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ఉభయ రాష్ట్రాలలో అనేక ఇతర వ్యవసాయ కళాశాలల ఆవిర్భావానికి స్ఫూర్తిదాయకమైందని అన్నారు. ఇక్కడ వ్యవసాయ విద్యార్థులకు బోధనా సిబ్బంది నేరిపించే నైపుణ్యాల ప్రభావమే ఇందుకు దోహదపడిందన్నారు. పట్టభద్రులైన అనంతరం కేవలం ఉద్యోగ సముపార్జనే దృష్టిగా భావించకుండా పలు వ్యవసాయ పరిశ్రమలను స్థాపించే దిశగా పట్టభద్రులు కృషి చేయాలన్నారు. వ్యవసాయ ఉద్యోగతను కల్పించేందుకు సరికొత్త వ్యవసాయ సాంకేతిక ఆవిష్కరణలను సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి మాట్లాడుతూ ప్రపంచ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు బాపట్ల వ్యవసాయ కళాశాలలోనే బీజం పడిందని, దేశ దేశాలలో తమ వ్యవసాయ సాంకేతిక ప్రతిభను చాటి ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రజ్ఞులుగా ఇక్కడి విద్యార్థులు నిలిచారని పేర్కొన్నారు. జెనెటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.తుషారకు ఉత్తమ పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు బంగారు పతకాన్ని బహూకరించారు. డాక్టర్ బాలినేని వెంకటేశ్వర్లు, బాలినేని స్వరూపరాణిలు డి.మంజూషకు వెండి పతకాన్ని బహూకరించారు. కార్యక్రమంలో పలువురు పూర్వ అసోసియేట్ డీన్లను సత్కరించారు. విశ్వవిద్యాలయ అధికారులు, పూర్వ విద్యార్థులు, పీహెచ్‌డీ, పీజీ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,600

మోడల్ ధర రూ. 1,300

## మిర్చి యార్డు సమాచారం

(బుధవారం ధరలు)

| | |
|---|---|
| వచ్చిన బస్తాలు | 55,232 |
| అమ్మకాలు | 53,535 |
| నిల్వ | 9,175 |



**నాన్ ఏసీ కామన్ రకం** క్వింటా (రూ.)

| | |
|---|---|
| 334 | 9,500-13,000 |
| నంబరు-5 | 10,000-13,300 |
| 341 | 10,000-13,400 |
| సూపర్-10 | 10,000-13,000 |

**ఏసీ కామన్ రకం** క్వింటా (రూ.)

| | |
|---|---|
| 334 | 9,500-12,600 |
| నంబరు-5 | 10,000-13,500 |
| 341 | 10,000-13,500 |
| 4884 | 10,000-12,500 |

**నాన్ ఏసీ ప్రత్యేక రకాలు** క్వింటా (రూ.)

| | |
|---|---|
| తేజ | 10,000 - 13,800 |
| షార్క్-1 | 10,000-12,200 |
| బాడిగ-355 | 10,000 - 12,300 |
| దేవనూరు డీలక్స్ | 10,000 - 12,400 |
| ఆర్మూర్ | 9,600 - 10,800 |
| తాలుకాయలు | 5,000 - 6,900 |

**ఏసీ ప్రత్యేక రకాలు** క్వింటా (రూ.)

| | |
|---|---|
| తేజ | 10,000-13,600 |
| బాడిగ - 355 | 10,000-12,600 |
| దేవనూరు డీలక్స్ | 10,000-12,500 |
| తాలు | 5,200 - 7,000 |

-కొరిటిపాడు (గుంటూరు)

# పంట భూములే ప్లాట్లు

- గ్రామాల్లో ఇష్టారాజ్యంగా అక్రమ లే అవుట్‌లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



పంట పొలాల్లో అనుమతులు లేకుండా వేసిన ప్లాట్లు

**చీరాల టౌన్:** భూముల విలువకు రెక్కలు రావడంతో పంట పొలాలు కాస్తా ప్లాట్లుగా మారిపోయాయి. అనుమతులు లేని ప్లాట్లు కొనుగోలు చేసి జనం మోసపోతుండగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. చీరాల ప్రాంతంలో జనాభా సంఖ్య పెరుగుతుండడంతో పంట పొలాలను ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. అసైన్డ్ భూములను సైతం అమ్మకాలు చేస్తున్నారు. మండలంలోని ఈపూరుపాలెం, తోటవారిపాలెం 216 బైపాస్ రోడ్డు, పాత ఎస్సీ కాలనీ రోడ్డు, కుందేరు ఒడ్డు తదితర ప్రాంతాల్లోని పంట పొలాలన్నీ ఇప్పుడు ఇళ్ల ప్లాట్లుగా మారాయి. వాడరేవు తీరానికి వెళ్లే రోడ్డులో, జాండ్రపేట కుందేరు సమీపంలో, అలానే చీరాల పట్టణానికి దగ్గరలో ఉన్న గ్రామ పంచాయతీల్లో సైతం ఇష్టానుసారంగా ప్లాట్లు వేసి అమ్మకాలు చేస్తున్నారు. ఎన్‌వోసీలు లేకపోయినా అధికార పార్టీ ఆమోదం ఉంటే చాలట కనీసం పంచాయతీ అనుమతి కూడా లేకుండా ప్లాట్లు వేసి అమ్మకాలు చేస్తున్నారు. చీరాల ప్రాంతంలో వేస్తున్న మూడొంతుల లే అవుట్‌లకు కనీస అనుమతులు ఉండడం లేదు. అయినా ప్లాట్లు విక్రయిస్తున్నారు.

**కన్వర్షన్ ఫీజూ లేదు..**

ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నును కూడా రియల్టర్లు ఎగవేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంట పొలాలను ప్లాట్లుగా మార్చి లే అవుట్ వేయాలంటే ఆ పొలం మార్కెట్ విలువలో పదో వంతు కన్వర్షన్ ఫీజు ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన తర్వాత విస్తీర్ణంలో పదో వంతు స్థలం పార్కులకు, రోడ్లు, ఇతర అవసరాలకు వదలాల్సి ఉంటుంది. లే అవుట్‌కు కూడా ప్రభుత్వం తప్పనిసరిగా అనుమతి ఇవ్వాల్సి ఉంది. అయితే గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేకాధికారులు కొందరు భూముల యజమానులతో ములాఖత్ అయి అనుమతులు ఇస్తున్నారనే ప్రచారం జోరుగా ఉంది. పొలాన్ని ప్లాట్లుగా మార్చుకొనేందుకు ప్రభుత్వానికి ఎటువంటి ఫీజులు చెల్లించడం లేదు. నేరుగా ప్లాట్లు వేసి ఇష్టారాజ్యంగా అమ్మేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు కానీ, పంచాయతీ అధికారులు కానీ ఈ అక్రమ లే అవుట్‌లపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

**చర్యలు తీసుకుంటాం**

మండలంలో వేసిన లే అవుట్‌లకు అనుమతులు ఉన్నాయో లేవో పరిశీలన చేస్తా. గ్రామాల్లో అనుమతులు లేకుండా వేసిన వెంచర్లు, వాటి వివరాలను సేకరించడంతోపాటు అనుమతులు లేకుండా ప్లాట్లు వేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. అసైన్డ్ భూములను ఆక్రమించి లే అవుట్లు వేస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటా.

-గోపీకృష్ణ, తహసీల్దార్

## మహిళలపై మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపులు అరికట్టాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి



సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

**రేపల్లె:** మహిళలపై వేధింపులకు పాల్పడే మైక్రో ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని, డ్వాక్రా మహిళల వద్ద అక్రమ వసూళ్లు, అవినీతిని అరికట్టాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. పట్టణంలోని జగనన్న కాలనీలో అధిక వడ్డీలు, అక్రమ వసూళ్లు అనే అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లల చదువులు, ఆరోగ్యాల కోసం తప్పని పరిస్థితుల్లో అప్పుల ఊబిలోకి నెట్టబడుతున్నారన్నారు. ప్రభుత్వ బ్యాంకులు, డ్వాక్రాలో ఉన్న మహిళలకు కూడా సక్రమంగా ప్రభుత్వం రుణాలు మంజూరు చేయకపోవటంతో ప్రైవేటు మైక్రో ఫైనాన్స్ కంపెనీలను ఆశ్రయిస్తున్నారన్నారు. ఫైనాన్స్ సంస్థలు అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి మహిళలను మానసికంగా, ఆర్థికంగా హింసిస్తున్నారని అన్నారు. డ్వాక్రాలో కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు పలుచోట్ల అవినీతికి పాల్పడుతున్నారన్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులను లంచాల కోసం వేధిస్తున్నారన్నారు. ప్రతిచోట డ్వాక్రాలో అవినీతి రాజ్యమేలుతున్నా ఉన్నతాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. అన్ని అర్హతలు ఉన్న గ్రూపులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించకుండా ఆర్పీలు లంచాలు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తున్నాయన్నారు. రుణాల కోసం ఆర్పీలకు లంచాలు చెల్లించి నెలవారి కిస్తీలు కట్టలేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ అంశాలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించామని అవగాహన సదస్సులు నిర్వహిస్తూ మహిళలను చైతన్య పరుస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. మైక్రోఫైనాన్స్ సంస్థల ఆగడాలు అరికట్టటంతోపాటు డ్వాక్రాలో జరుగుతున్న అవినీతిని నిర్మూలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పలు అంశాలపై మాట్లాడారు. సదస్సులో సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్.మణిలాల్, ఐద్వా పట్టణ కార్యదర్శి నాంచారమ్మ, నాయకులు వి.ధనమ్మ, సభ్యులు ఎస్‌కే.ఫర్జానా, స్వావమ్మ, వనజాక్షి, లక్ష్మణరావు, డి.అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల తనిఖీలు



ఓ ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు

**రేపల్లె:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే విక్రయించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మైలవరం వ్యవసాయ సహాయ సంచాలకులు టి.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని ఫెర్టిలైజర్స్ దుకాణాలపై వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా బుధవారం తనిఖీలు నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరువుల దుకాణాల ఎదుట తప్పనిసరిగా స్టాక్ బోర్డును, ధరల పట్టిక వినియోగదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. విత్తనాల నాణ్యతలో రాజీపడరాదని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయించరాదన్నారు. దుకాణాలలో స్టాక్‌కు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించి అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు అద్దేపల్లి లక్ష్మి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మహేష్‌బాబు, విస్తరణ అధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటికి చేరేలోపే మృత్యువాత

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోపీకృష్ణ



గోపీకృష్ణ బైకును ఢీకొట్టిన ట్రాక్టర్

**బల్లికురవ:** పింగాణీ పరిశ్రమలో పని చేస్తూ డ్యూటీ ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్న యువకుడిని, సుబాబుల్ కర్ర లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం అర్ధ రాత్రి చెన్నుపల్లి-అనంతవరం ఆర్‌అండ్‌బీ రోడ్డులోని వేమవరం గ్రామంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. బల్లికురవ పంచాయతీలోని కొండాయపాలెం గ్రామానికి చెందిన పూరిమెట్ల శ్రీనివాసరావుకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె. పెద్ద కుమారుడు వెంకటేష్ బార్బర్ షాప్ నిర్వహిస్తూ జీవనాన్ని వెళ్లదీస్తున్నారు. రెండో కుమారుడు గోపికష్ణ (30) ఎంబీఏ వరకు చదువుకున్నాడు. వేమవరం గ్రామ సమీపంలోని పింగాణీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. డ్యూటీ ముగిసిన తదుపరి ఇంటికి వెళుతుండగా వేమవరం నుంచి చిలకలూరిపేట వైపు సుబాబుల్ కర్ర లోడుతో వెళుతున్న ట్రాక్టర్ డోర్లు విడిచి వస్తోంది. అది అకస్మాత్తుగా ఢీకొట్టడంతో మార్జిన్ అర్థం కాక గోపికృష్ణ బైక్ పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జయింది. అరగంటలో ఇంటికి చేరేలోపే ఈ ప్రమాదం సంభవించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతునికి నాలుగు సంవత్సరాల కిందట అమూల్య కుమారితో వివాహమైంది. మూడు సంవత్సరాల బాబు ఉండగా.. ప్రస్తుతం అమూల్య నిండు గర్భిణి. బుధవారం మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు బల్లికురవ ఎస్సై వై. నాగరాజు కేసు నమోదుతో పోస్టుమార్టం నిమిత్తం భౌతిక కాయాన్ని మార్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కొండాయపాలెం, చెన్నుపల్లి గ్రామాల్లో అందరితో కలివిడిగా ఉండే శ్రీనివాసరావు కుమారుడు రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందటంతో రెండు గ్రామాల్లోని ప్రజలు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

### రెండు ఆటోలు ఢీ- ఏడుగురికి గాయాలు



**పులిగడ్డ(అవనిగడ్డ):** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిగడ్డ టోల్‌ప్లాజా సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ శ్రీనివాస్ అందించిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా వేమూరుకు చెందిన కొందరు ఆటోలో మోపిదేవి ఆలయానికి వచ్చి తిరిగి వెళుతుండగా, రేపల్లె వైపు నుంచి వస్తున్న కోడిగుడ్ల ఆటో లారీని తప్పించబోయి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వీరరాఘవమ్మ, కోసూరు అరుణతోపాటు మరో ఐదుగురికి గాయాలయ్యాయి. వీరరాఘవమ్మ, అరుణలను మచిలీపట్నం తరలించగా, స్వల్పగాయాలైన మిగిలిన వారిని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## 'మధ్యవర్తిత్వం-దేశం కోసం' ప్రదర్శన





పురవీధుల్లో ప్రదర్శన చేపట్టిన న్యాయమూర్తులు,న్యాయవాదులు

**బాపట్ల:** మధ్యవర్తిత్వం-దేశం కోసం అనేది ప్రతి ఒక్కరూ గమనించాలని అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి ఓ.శ్యామ్‌బాబు అన్నారు. మధ్యవర్తిత్వం-దేశం కోసం అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం బాపట్ల పట్టణంలో జిల్లా కోర్టు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ర్యాలీ ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి బయలుదేరి పాత బస్టాండ్ వరకు నిర్వహించారు. అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి ఓ.శ్యామ్‌బాబు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా తగాదాలు, వివాదాలు పరిష్కరించే విషయంపై ప్రజల్లో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కరించుకోవడం వల్ల సమయం వృథా కాకుండా చేసుకోవచ్చని ఇది కోర్టు తీర్పు కంటే బలమైనదిగా భావించాలన్నారు. ప్రతి ఒక్కరూ మధ్యవర్తిత్వం ద్వారా వివాదాన్ని పరిష్కరించుకోవడానికి కృషి చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఓ.అవినాష్ మాట్లాడుతూ ఈ మధ్యవర్తిత్వం పూర్వకాలం నుంచి ఉందని కృష్ణుడు కూడా పాండవులు, కౌరవుల మధ్య సంధి కుదర్చటానికి ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎ.వాణి, సీనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.రేణుక తదితరులు పాల్గొన్నారు.

### నల్లబర్లీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రులు



**సంతమాగులూరు(అద్దంకి):** సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నల్ల బర్లీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రతి రైతూ పండించిన నల్లబర్లీ ఆకు మొత్తం కొనుగోలు చేస్తామని చెప్పారు. అందుకే కొనుగోలు కేంద్రాలను పెంచుతున్నట్లు తెలిపారు. నూతన మార్కెట్ కమిటీ, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తేలప్రోలు రమేష్, మరికొంతమంది సభ్యులుగా ప్రమాణీ స్వీకారం చేశారు. కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, ఎరిక్షన్‌బాబు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### ఐకార్ విశ్రాంత శాస్త్రవేత్తలతో చర్చా కార్యక్రమం






వ్యవసాయ బులెటిన్‌ను విడుదల చేస్తున్న ఐకార్ విశ్రాంత శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు

**గుంటూరు రూరల్:** ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదజయలక్ష్మీదేవి అధ్యక్షతన ఐకార్ (ఐసీఏఆర్) విశ్రాంత శాస్త్రవేత్తలతో విశ్వవిద్యాలయం పరిధిలోని విద్యార్థులు, శాస్త్రవేత్తలతో చర్చా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నగర శివారుల్లోని లాంఫాంనందున్న విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐకార్ విశ్రాంత శాస్త్రవేత్తలైన ప్రధాన శాస్త్రవేత్త (ఇక్రిశాట్) డాక్టర్ ఎస్ఎన్ నిగం, డైరెక్టర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్) డాక్టర్ డీఎం హెగ్డే, ఐకార్ ఏడీజీ డాక్టర్ బీబీ సింగ్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా వ్యవసాయంలో నేల ఆరోగ్య పరిరక్షణ అనే వ్యవసాయ బులెటిన్‌ను రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది వినియోగించుకునేందుకు వీలుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఎన్ నిగం మాట్లాడుతూ వివిధ పంటల రకాల రూపకల్పనలో ఆధునిక పద్ధతులతోపాటు సంప్రదాయ విధానాలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. పరిశోధనలలో సరైన ప్రణాళికలు ముందుగానే రూపొందించుకుని చేయటం వల్ల ఆశించిన ఫలితాలను సులువుగా సాధించవచ్చన్నారు. వివిధ పంటల్లో బ్రీడింగ్ విధానాలు, విత్తన ఉత్పత్తి తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, కమ్యూనిటీ సైన్స్, ఏపీజీసీ శాస్త్రవేత్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### 19 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

**గుంటూరు వెస్ట్ (క్రీడలు):** జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20వ తేదీల్లో 52వ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అండర్-11 నుంచి అన్ని విభాగాలతోపాటు మాస్టర్స్ విభాగంలో 35 + నుంచి 70 + వరకు పోటీలు ఉంటాయన్నారు. విజయాలు సాధించిన వారిని విభాగాలుగా రాష్ట్ర పోటీలకు పంపిస్తామని తెలిపారు. అనంతరం పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శ్రీనివాసరావుతోపాటు రమేష్, వెంకటేశ్వరరావు, సతీష్ చంద్ర, రాము, రమేష్, కోచ్ బాషా ఆవిష్కరించారు.

### నా భార్య కారణంగానే చనిపోతున్నా..

సెల్ఫీ వీడియో తీసుకొని యువకుడు ఆత్మహత్య



బ్రహ్మయ్య (ఫైల్)

**తాడేపల్లి రూరల్:** తన చావుకు భార్య కారణమని పేర్కొంటూ ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం... తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటకు చెందిన బ్రహ్మయ్య (30) సీసీ కెమెరాల టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళగిరి టిడ్కో నివాసాల్లో ఉంటున్న యువతితో వివాహం జరిగింది. ఆమె ప్రవర్తన సరిగ్గా లేదని పుట్టింటికి పంపించేశాడు. అందరూ బ్రహ్మయ్యను బతిమిలాడితే ఆమెను కాపురానికి తీసుకొచ్చినట్లు బంధువులు తెలిపారు. అత్తాకోడళ్ల గొడవల కారణంగా బ్రహ్మయ్య సొంత ఇంటి నుంచి ఉండవల్లి అమరావతి రోడ్‌లోని ఒక ఇంటిలో అద్దెకు దిగాడు. అక్కడ మళ్లీ ఆమె ఫోనులో ఎక్కువగా మాట్లాడుతుండటంతో గొడవలు జరిగాయి. ఈలోగా ఆషాఢ మాసం రావడంతో పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో తన చావుకు భార్య కారణం అంటూ సెల్ఫీ వీడియో తీసుకొని బ్రహ్మయ్య ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాడేపల్లి పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. భర్త చనిపోయిన ఏడాదికే ఇలా కుమారుడు కూడా ఆత్మహత్య చేసుకోవడంతో బ్రహ్మయ్య తల్లి కన్నీరుమున్నీరైంది. ఇష్టం లేకపోతే విడాకులు తీసుకుందామని చెప్పినా ఎందుకు ఇలా చేశావని ఆవేదన వ్యక్తం చేసింది. తన కుమారుడి చావుకు కారణమైన కోడలు, ఆమె ప్రియుడిని శిక్షించాలని డిమాండ్ చేసింది.

### లైంగికదాడి కేసులో వ్యక్తికి రిమాండ్

**చీరాల:** బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి చీరాల కోర్టు 14 రోజులు జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు వన్‌టౌన్ ఎస్.ఐ జి.రాజ్యలక్ష్మి బుధవారం తెలిపారు. పట్టణంలోని ఓ మైనర్ బాలికపై అదే ప్రాంతానికి చెందిన పుల్లేటికుర్తి పుల్లయ్య అనే వ్యక్తి లైంగిక దాడికి ప్రయత్నించినట్లు సదరు బాలిక మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తులో భాగంగా ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి బుధవారం ఉదయం నిందితుడిని ఇంటి వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

### వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పద్మారావు

**కొల్లూరు:** వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జాయింట్ సెక్రటరీగా మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం విడుదల చేసింది.

## బదిలీ అయిన ఉపాధ్యాయులకు వేతనాలివ్వాలి







మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

**గుంటూరు ఎడ్యుకేషన్:** బదిలీలు ముగిసిన 45 రోజుల తరువాత సైతం కొంత మంది ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించకపోవడం సరికాదని, వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ .. ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ బదిలీల్లోని అసంబద్ధ అంశాలు తొలగించి, సవరణ ఉత్తర్వులు కోరుతూ అనేక మంది ఉపాధ్యాయులు పెట్టుకున్న గ్రీవెన్స్‌ను త్వరగా పరిష్కరించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ మెగా పీటీఎం విట్నెస్‌పై ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి మరీ విద్యాశాఖాధికారులు సమాచారాన్ని సేకరించడం పట్ల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, కె.సాంబశివరావు, ఎండీ షకీలా బేగం, టి.ఆంజనేయులు, కె.కేదార్‌నాథ్, కె.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎదురెదురుగా రెండు కార్లు ఢీ



కారులో ఇరుక్కున్న వ్యక్తిని బయటకు తీసేందుకు యత్నిస్తున్న దృశ్యం



ప్రమాదంలో గాయపడిన మహిళ

ఒకరు మృతి, నలుగురు మహిళలకు గాయాలు

**తాడికొండ:** రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యక్తి దుర్మరణం చెందాడు. నలుగురు మహిళలు గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండల పరిధిలోని నిడుముక్కల గ్రామంలో బుధవారం జరిగింది. వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి అమరావతికి మ్యారేజ్ బ్యూరోకు సంబంధించిన నలుగురు మహిళలతో కారు వెళుతోంది. అమరావతి నుంచి గుంటూరు మరో కారు వస్తోంది. కళాజ్యోతి కార్యాలయం వద్దకు రాగానే ఎదురెదురుగా ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మొదటి కారు డ్రైవర్ విజయవాడ యనమలకుదురుకు చెందిన పి.నాగేశ్వరరావు (38) మృతి చెందాడు. నలుగురు మహిళలు తీవ్రగాయాలపాలై స్పృహ తప్పి పడిపోయారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. సీఐ వాసు, సిబ్బంది సహకారంతో నాగేశ్వరరావును మృతదేహాన్ని బయటకు తీశారు. మరో వాహనంలో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. వారంతా పెదకూరపాడు ఎమ్మెల్యేకు చెందిన బంధువులుగా సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.